తననెందుకు కాల్చారు?  ఆ ఫోటో గ్రాఫర్ ఎవరు?  తను అర్జున్ రూపంలో వున్నాడు కదా!  అంటే అర్జున్ అనుకుని తనను కాల్చాడా?  అర్జున్‌ని మాత్రం  ఎందుకు కాల్చాలసలు? అంటే అర్జున్‌కి ప్రమాదకరమైన శత్రువులున్నారా?

గుండె ఝల్లుమందతనికి. భయం విద్యుత్‌లా పాకింది.

"అంటే .....ఇలా హత్యా ప్రయత్నం జరుగుతుందనే  తనను అర్జున్ స్థానంలో  ప్రవేశ పెట్టారా?  మైగాడ్?  అంతే... అదే ప్లాన్ అయియుండాలి.  లేకపోతే  పది లక్షలు ఎందుకిస్తారు?  అతనిలాగా తన ముఖం ఎందుకు మారుస్తారు ?  తనను బలి  పశువులా వాడుకోడానికే  ఈ ఎత్తుగడ".

గొంతు  తడారిపోయిందతనికి.

డాక్టర్‌తో పాటు మాధురి, విష్ణు బయటికి  వెళ్ళిపోయారు. తన భుజం వేపు చూసుకున్నాడు అతను.

బ్యాండేజ్ క్లాత్‌లో నుంచి ఎర్రగా రక్తం మరక. ఆఖరి క్షణంలో  తను పసిగట్టకపోయినట్లయితే ఆ పిస్టల్ గుండు సరిగ్గా చాతీలోనే దిగేది.  అక్కడికక్కడే ప్రాణాలు వదిలేవాడు.  ఆ ఆలోచనతోనే  అతని శరీరమంతా వణుకు పుట్టుకొచ్చింది.

తనెలాగూ హత్య చేయబడతాడనీ, అప్పుడెలాగూ  మిగతా  తొమ్మిది లక్షలూ ఇవ్వక్కర్లేదని వాళ్ళకు తెలుసు.  తను చావడం ఖాయమనే అంత పెద్ద  మొత్తం ఎరగా  పెట్టారు.

వాళ్ళిచ్చిన లక్ష రూపాయలే నిజానికి తన ప్రాణం  ఖరీదు.

ఊహు!  ఇంకొక్క క్షణం కూడా తనీ డెత్‌సెల్ లో వుండకూడదు.  వీలయినంత త్వరగా తప్పించుకు పారిపోవాలి. తప్పించుకు పారిపోగలడా తను?  హఠాత్తుగా వినయ్ విషయం గుర్తుకొచ్చింది. గుండెలవిసిపోయినయ్.

ఈ విషయం తెలుసుకునే  వినయ్ తప్పించుకు పారిపోవడానికి ప్రయత్నించాడా? అతన్ని  వెంటాడి  చంపారా?

లేచి గది కిటికీ దగ్గరకు నడిచి కర్టెన్ తొలగించి చూశాడతను.  చుట్టూ వున్న ఉద్యానవనంలో సెక్యూరిటీ  గార్డులు నాలుగు  వేపులా గన్స్‌తో కనబడుతున్నారు.

తను సాహసాలు చేయకూడదు.  చేస్తే వినయ్‌లా కారు ప్రమాదానికి గురయి ప్రాణాలు కోల్పోతాడు.

వెనక్కు తిరిగి వచ్చి మంచం మీద పడుకున్నాడు.  చాలాసేపు కంటి మీద కునుకే లేదు.

మర్నాడుదయం తిరిగి విష్ణు లేపుతూంటే  మెలకువ వచ్చింది.

త్వరత్వరగా లేచి బాత్ రూమ్ వైపు నడిచాడు. రాత్రి వున్న టెంపరేచర్ ఇప్పుడు లేదు.

భుజంలో నొప్పి కూడా చాలా వరకూ తగ్గిపోయింది.

ఫలహారం చేస్తూండగా వచ్చింది మాధురి చిలుకతో పాటు. వెనుకే సహదేవ్.

"ఎలా వుంది మీకిప్పుడు ?" అడిగిందామె పక్కనే అతి సమీపంగా కూర్చుంటూ. ఆమె స్పర్శ వెచ్చగా తగులుతోంది. ఆ వెచ్చదనంలో భుజానికి గాయం వున్న విషయమే మర్చిపోతున్నాడు.

"ఫైన్" అన్నాడు సురేష్ .

"రాత్రి బాగా నిద్ర పట్టిందా?" అడిగాడు సహదేవ్.

"లేదు"

"ఎందుకని?"

"వాడెవడో... నన్నెందుకు కాల్చాడా అని ఆలోచిస్తూండిపోయాను"

ఆమె ముఖంలో కలవరపాటు కనిపించింది. సహదేవ్ వైపు చూసింది. అతని ముఖంలో రంగు మారింది. తనకు తెలుసు ముఖంలో ఆ రంగు ఎప్పుడు వచ్చేది. మోసం బయటపడినప్పుడు.

"మేమూ అదే ఆశ్చర్యపోతున్నాం సురేష్! ఒకే ఒక్క కారణం కనిపిస్తోంది. అతనికి మెంటల్ బ్యాలెన్స్ సరిగా లేదేమోనని . అతను బ్రతికుంటే మనకు స్పష్టంగా తెలిసేది"

సురేష్ గుండె వేగంగా కొట్టుకుంది.

"అంటే ....అతను చనిపోయాడా?"

"అవును. కరెంట్ పోగానే మెట్లమీద నుంచి కిందకు పరుగెత్తబోయి స్లిప్ అయి పడిపోయాడు. 24 గంటల్లో అవుట్"

సురేష్ చకచకా ఆలోచించసాగాడు. అతనూ ప్రొఫెషనలే. అలా పడిపోవటం అసాధ్యం. వీళ్ళే చంపేసి వుంటారు. సందేహం లేదు.

ఆ ఫోటోగ్రాఫర్ శత్రువర్గానికి చెందిన వ్య క్తి . అతన్ని వీళ్ళు చంపేశారు గనుక వాళ్ళు మళ్ళీ రివెంజ్ తీసుకోటానికి రాక తప్పదు.

ఈ సారి వాళ్ళు పకడ్బందీగా రావటం ఖాయం. అప్పుడు తననెవరూ రక్షించలేరు.

"ఎనీవే! నువ్వేమీ భయపడనక్కర్లేదు సురేష్ ! నువ్వెక్కడికెళ్ళినా నీకు సెక్యూరిటీ గార్డ్‌ని కూడా ఏర్పాటు చేస్తున్నాను ఇకనుంచీ " చిరునవ్వుతో అన్నాడు సహదేవ్.

తనకు తెలుసు ఇదంతా నటన!

"బాగా విశ్రాంతి తీసుకో సురేష్! త్వరగా నయమైపోతుంది"

ఇద్దరూ వెళ్ళిపోయారు.

విష్ణు దగ్గరకొచ్చాడు.

"ఈ రెండు రోజులూ సుఖం అనుభవించు! ఇలా కలిసిరావాలి అదృష్టమంటే....."

"దయచేసి నువ్వు నోర్మూసుకుంటావా?" కోపంగా అన్నాడు సురేష్ .

విష్ణుకి కోసం ముంచుకొచ్చింది. అతని ముఖంలోకి క్రూరత్వం చొచ్చుకొచ్చేసింది.

"ఇంకొక్కసారి అలా వాగావంటే నెత్తురు కక్కుతావ్" అన్నాడు దగ్గరకొచ్చి.

"అలా జరిగితే సహదేవ్ నిన్నేం చేస్తాడో నాకు తెలుసు" చిరునవ్వుతో అన్నాడు సురేష్. "అందుకని యింక బయట కెళ్ళి కాపలా వుండు. నువ్వు ప్రస్తుతం నాకు బాడీగార్డ్‌వి. కనుక బాడీగార్డ్‌లాగానే వుండటం మంచిది".

విష్ణు అతి కష్టం మీద కోపం అణుచుకున్నాడు.

"నీకు ముందే దెబ్బ తగిలిందని వూరుకుంటున్నాను. కానీ నీకు ఏదో ఒకరోజు రుచి చూపిస్తాను నా బలం ఎలాంటిదో " బయటకు నడుస్తూ అన్నాడు.

సురేష్ తలుపు బోల్ట్ వేసుకుని మంచం మీద వాలిపోయాడు. తను తప్పించుకోవాలిక్కడినుంచి. ఏదొక ఉపాయం ఆలోచించాలి లేకపోతే ఏదొక రోజు మర్డర్ అవటం ఖాయం.

లేచి కిటికీ దగ్గరకెళ్ళి కర్టెన్స్ తొలగించి చూశాడు. సెక్యూరిటీ గార్డ్స్ కనబడుతూనే వున్నారు భుజాలకు గన్స్ తగిలించుకుని.

కాంపౌండ్ వాల్ పక్కనే ఎత్తుగా అశోక వృక్షాలు. చీకట్లో అయితే తనను ఎవరూ గమనించకుండా వాటిని చేరుకుని అశోకవృక్షం పట్టుకుని పైకెగబ్రాకి గోడ దూకేయవచ్చు. వాళ్ళు ఆ సమయంలో చూడకపోతే ఫర్లేదు. కానీ చూస్తే?

ఒకే ఒక్క బులెట్ ... తను చచ్చి కిందపడి వుంటాడు. కర్టెన్ లాగేసి వచ్చి మళ్ళీ పడుకున్నాడతను. రాత్రంతా ఆలోచించటంతోనే గడిచిపోయింది.

ఖరీదయిన డాక్టర్. ఖరీదయిన మందులు, ఖరీదయిన సుఖాలు. కానీ వెలితి..... తులసి కౌగిలి వెలితి.

ప్రతిరోజూ ఆమె నగ్న స్పర్శను అనుభవించే అలవాటుకు బానిస అయిన శరీరం ఎదురుతిరుగుతోంది. ఆమె మరికొద్ది నెలల వరకూ తన కౌగిట్లోకి వచ్చే అవకాశం లేదన్న విషయం ఆ కోరికలను మరింత రెచ్చగొడుతోంది. బాత్ రూమ్ లోకి వెళ్ళాడు స్నానం చేసేందుకు. డోర్‌మీద సున్నితంగా, నెమ్మదిగా తట్టిన చప్పుడు.

తలుపు కొంచెంగా తెరచి చూశాడు. ఎదురుగా మాధురి.

మెరూన్ కలర్ చీర లోపలి నగ్నశరీరానికి మెరూన్ రంగు పిలిమినట్లు కవ్వించే పెదాల

మీద సెక్సీ చిరునవ్వుతో. చల్లారిన కోరికలు మళ్ళీ బుసలు కొట్టినయ్.

సురేష్ వంకే చూస్తోందమె. నీళ్ళు కారుతున్న అతని జుట్టూ , నగ్నంగా వున్న అతని విశాలమయిన చాతీ. చిన్నగా నవ్వాడతను. చప్పున కోలుకుందామె.

"అర్జంటుగా మనం ఆఫీసుకెళ్ళాలి సురేష్ "

"ఓ. కె ! ఇప్పుడు వచ్చేస్తున్నాను మేడమ్"

తలుపు మూసి త్వరత్వరగా స్నానం ముగించి బయటికొచ్చాడు. గదిలో మాధురి లేదు. డ్రస్ చేసుకుని గది తలుపు బోల్ట్ తీయబోతూ షాక్ కొట్టినట్లయి ఆగిపోయాడు.

గది తలుపు లోపల్నుంచి బోల్ట్ చేసి వుంది. మరి మాధురి లోపలికెలా వచ్చినట్లు అతనికి మతి పోయినట్లయింది. మరోసారి బోల్ట్ వైపు చూశాడు.

లోపల్నించి వేసే వుంది. ఎలా సాధ్యమది? ఆమె వచ్చేటప్పుడు బోల్ట్ వేసి లేదనుకున్నా, వెళ్ళేటప్పుడు లోపల బోల్ట్ ఎలా వేయగలిగింది? ఒకవేళ గదిలోకి యింకో ద్వారం ఏమైనా వుందా? గదంతా తిరిగి గోడలు చేత్తో తడిమి పరీక్షించాడతను. ఎక్కడా ఏమీ కనిపించటంలేదు. అసలు మాధురి తన గదిలోకొచ్చిందా లేక అంతా తన ఊహా?

తలుపు తట్టిన చప్పుడు...... బోల్ట్ తీస్తూనే విష్ణు లోపలికొచ్చాడు.

వెనుకే మాధురి, అర్జున్ లోపలికొచ్చారు.

ఇద్దరూ సోఫాలో కూర్చున్నారు "సారీ సురేష్! దురదృష్టకరమైన సంఘటన జరిగిందని మాధురి చెప్పింది. మరోసారి అలా జరగకుండా జాగ్ర త్తలు తీసుకున్నాం" అన్నాడు అర్జున్.

"థాంక్యూ" అన్నాడు సురేష్.

"ఎనీ ప్రాబ్లమ్స్ సురేష్?" అడిగాడతను.

"ఎస్! మా ఇంటికి లెటర్ రాయాలి నేను క్షేమంగా వున్నట్లు. అలాగే తులసి క్షేమంగా వుందో లేదో తెలుసుకోవాలి".

అర్జున్ మాధురి వైపు చూశాడు.

"నువ్వు ఉత్తరాలేమీ రాయకూడదు సురేష్! తులసి క్షేమం సంగతి మేము కనుక్కొని చెప్తాం" అందామె.

"కానీ తులసికి నా క్షేమసమాచారాలు తెలియాలి. నా అడ్రస్ ఇవ్వకపోయినా నేనెక్కడున్నదీ తెలియకపోయినా ఫర్లేదు"

అర్జున్ లేచి నిలబడ్డాడు "సారీ మిస్టర్ సురేష్ ! అది మాత్రం కుదరదు."

ఇద్దరు బయటికెళ్ళిపోయారు.

విష్ణు అతని దగ్గరకొచ్చి నిలబడ్డాడు.

“పద ఆఫీస్‌కి టైమయింది” అన్నాడు.

సురేష్ ఆఫీస్‌లో తన గదిలోకి నడుస్తూంటే ప్రత్యూష చిరునవ్వుతో పలుకరించింది.

“గుడ్‌మాణింగ్ సర్”

“గుడ్ మాణింగ్” ఆమె అందమయిన పంజాబీడ్రస్ వేపు కొద్ది క్షణాలు చూస్తూండిపోయాడు.

తేరుకుని లోపలకు నడిచాడు. కొద్ది క్షణాల తర్వాత ఆమె ఫైల్ తీసుకొచ్చి అతని టేబుల్ మీదుంచింది.

“మీ సంతకాల కోసం సార్!”

“ప్రత్యూషా!”

“ఎస్సర్”

“యూ ఆర్ వెరీ బ్యూటిఫుల్”

ఆమె కళ్ళల్లో కలవరం, ఆశ్చర్యం, ఆనందం అన్నీ ముప్పిరి గొన్నయ్.

“థాంక్యూ సర్”! సిగ్గుపడుతూ అంది.

“టెల్ మీ సమ్‌థింగ్ ఎబౌట్ యూ ప్రత్యూషా! ఈ జాబ్‌లోకి రాకముందు మీరేం చేసేవారు?”

“లైబ్రేరియన్‌గా టెంపరరీగా వర్క్ చేశాను. అది పోయింది. వెంటనే లక్కీగా ఈ జాబ్ దొరికింది.

“ఈ జాబ్ దొరకటం ‘లక్’ అనుకుంటున్నావా?”

“అవున్సార్! ఎందుకిలా అడిగారు?”

“ఈ జాబ్‌కి నువ్వు దొరకటం ‘లక్’ అనుకుంటున్నాను”

ఆమె మళ్ళీ సిగ్గుపడుతూ నవ్వింది.

పక్కనే దగ్గు వినిపించింది. విష్ణు లోపలికొచ్చి నిలబడ్డ విషయం తను గమనించనే లేదు.

“ఓ .కె ప్రత్యూషా! సైన్ చేసి మళ్ళీ పిలుస్తాను.”

“అలాగే సర్!”

బయటకెళ్ళిపోయిందామె.

తన చేతిలోని ఫైల్ తీసి విష్ణు ముఖం మీదకు విసిరికొట్టాడు సురేష్. అది విష్ణుకి తగిలి విడిపోయి కాగితాలన్నీ గదంతా ఎగరసాగి నయ్.

విష్ణు ఇంక ఆలస్యం చేయలేదు. అతని మీదకు ఒక్క దూకు దూకి బలంగా ముఖంమీద కొట్టాడు. అతను టేబుల్‌కి కుర్చీకి మధ్యలో పడిపోయాడు.

విష్ణు కళ్ళల్లోనుంచి నిప్పులు రాలుతున్నాయ్.

"కమాన్ గెటప్, ఇంకొక్కటిస్తే     ఇక జన్మలో నోరెత్తవ్"

అతను లేచి నిలబడ్డాడు. నోటి అంచునుంచీ సన్నగా రక్తం కారుతోంది. అది చూసేసరికి విష్ణు ఆవేశం అణగారిపోయింది. అతని ముఖంలో ఆందోళన కనిపించింది.

"పద ముందా మూతి కడుక్కునిరా!" అన్నాడు కలవరపాటుతో అతను బాత్ రూమ్‌లోకెళ్ళి నోట్లో నీళ్ళు పుక్కిలించి వూశాడు. అలాగే నాలుగయిదుసార్లు చేశాక రక్తం రావటం ఆగిపోయింది. తిరిగి వచ్చి కుర్చీలో కూర్చునేసరికి టేబుల్ మీద వేడి 'టీ' సిద్ధంగా వుంచాడు విష్ణు.